క్లుప్తంగా

మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆరాధనోత్సవాలు


లక్ష్మమ్మవ్వ మూలవిరాట్

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో వెలసిన మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆరాధనోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పెద్దలు, భక్త బృందం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతులు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు. గురువారం లక్ష్మమ్మవ్వకు అభిషేక పూజలు గావించి, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు లక్ష్మీకాంత రెడ్డి, రఘుమూర్తి స్వామి వివరించారు. గ్రామ పెద్దలు, సర్పంచ్ తోట సావిత్రి, వైస్ ఎంపీపీ షేక్ సాహెబ్, ఎంపీపీ సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

హోల్వీలో కార్డెన్ సెర్చ్


గ్రామస్తులకు సూచనలు చేస్తున్న పోలీసులు

కౌతాళం: మండల పరిధిలోని హోల్వీ గ్రామంలో బుధవారం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు, రౌడీషీటర్లు, పలు అనుమానితల ఇళ్లల్లో సోదాలు చేపట్టారు. అలాగే నాయకులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరు శాంతియుతంగా నడుచుకోవాలని, ఎవరు గెలిచినా ఓడినా సంయమనంతో వ్యవహరించాలన్నారు. సంబరాలు, ర్యాలీలు చేపట్టరాదన్నారు. కోసిగి సీఐ ప్రసాద్, ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ బాబురాజు

ఆదోని టౌన్: క్షయ వ్యాధిని గుర్తించేందుకు గల్ల, రక్త పరీక్షలు చేయించుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు సూచించారు. బుధవారం స్థానిక విక్టోరియాపేటలో ప్రజలకు క్షయవ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా ఎక్స్‌రే పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే బాధితుడికి ఆరు నెలలపాటు ప్రభుత్వమే ఉచితంగా ఖరీదైన మందులను అందిస్తుందని వివరించారు. అలాగే ప్రతినెలా రూ.500 నగదును అందిస్తుందని చెప్పారు. పౌష్టికాహారం, వ్యక్తిగత శుభ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటిపై మహిళలకు వివరించారు. మాస్కు ధరించాలని, దగ్గినా, తుమ్మినా మోచేయిని అడ్డు పెట్టుకోవాలన్నారు. కుటుంబ సభ్యులకు వ్యాధి సోకకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సూపర్‌వైజర్ లలితమ్మ, ఆశావర్కర్లు హీరావలి, అంగన్‌వాడీ వర్కర్ కావ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించండి


శ్మశాన వాటికలో పారుతున్న మురుగు నీరు

కోసిగి: మండల కేంద్రంలోని సజ్జలగుడ్డం రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటికలోకి మురుగు నీరు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. డ్రైనేజీలో యథావిధిగా ప్రవహిస్తున్న మురుగు నీటిని రెండు రోజుల కిందట ఓ వ్యక్తి పైప్‌లైన్ వేసి మళ్లించాడని, దీంతో మురుగు నీరు శ్మశాన వాటికలోకి చేరుతుందని వాపోయారు. ఇలాగే కొనసాగితే శ్మశాన వాటిక మురుగునీటితో నిండిపోయి శవాలను పాతిపెట్టడానికి వీల్లేకుండా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. శ్మశాన వాటికలోకి మురుగు నీరు వెళ్లకుండా చూడాలని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

పరీక్షా ప్యాడ్‌లు, పెన్సిళ్ల పంపిణీ

ఆదోని అర్బన్: పట్టణంలోని కునిమొహల్లాలో ఉన్న సయ్యద్‌నూరి మదరసాలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా చిన్నారులకు బుధవారం పెన్సిళ్లు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు. క్యాంపులో పాల్గొన్న 70 మంది విద్యార్థులకు ఏపీయూడబ్ల్యూజే ఆదోని తాలూకా కార్యదర్శి, జర్నలిస్ట్ హుసేన్‌బాషా ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్‌లు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ముఫ్తీ ఆసీఫుద్దీన్‌ఖాద్రి, వార్డు కౌన్సిలర్ ఉస్మాన్‌బాషా, మదరసా సభ్యులు హఫీసాబ్ తురాబ్, షబ్బీర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

లోతు దుక్కులతో ఎంతో మేలు

- వేసవి దుక్కులతో రైతన్నకు ప్రయోజనం
- చీడ పురుగుల నివారణకు ఆస్కారం
- దిగుబడులు పెరగాలంటే వేసవి దుక్కులు కచ్చితం


ఎర్ర రేగడి పొలంలో తిరగలి మడకతో దుక్కి దున్నుతున్న రైతన్న (ఫైల్)

నందవరం: ఇటీవలి వర్షాలు, ఇన్‌పుట్ సబ్సిడీ జమ కావడంతో ఖరీఫ్ సాగుకు ఉత్సాహంగా సన్నద్ధమైన రైతన్నలు వేసవి దుక్కులకు ఉపక్రమించారు. లోతు దుక్కులను వేసవి దుక్కులుగా పేర్కొంటారు. వేసవి దుక్కుల విషయంలో రైతులు జాగ్రత్తలు పాటిస్తే మంచి ఫలితాలు పొందవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. చీడ పురుగులు, కలుపు మొక్కల నివారణకు ఈ దుక్కులు దోహదపడతాయి. అలాగే భూసారంతోపాటు తేమ శాతం పెంచేందుకు ఆస్కారం ఉంటుంది. పెట్టుబడుల తగ్గుదలతోపాటు మంచి దిగుబడులు సాధించడానికి వేసవి దుక్కులు అనుకూలంగా ఉంటాయి.

వేసవి దుక్కులు చేసుకునే విధానం

పంటల సాగును బట్టి దుక్కులు చేసుకోవాల్సి ఉంటుంది. వేరు వ్యవస్థ లోతుగా ఉండే పంటలకు (ఉదా.. కంది, ఆముదం, పత్తి) 25–30 సెంటీమీటర్ల లోతు దుక్కి చేసుకోవాలి. సాధారణ వేరు వ్యవస్థ కలిగిఉండే పైర్లకు (ఉదా.. వేరుశనగ, జొన్న, మొక్కజొన్న) 15–20 సెంటీమీటర్ల లోతు దున్నుకోవాలి. వేసవి దుక్కులకు మోల్డ్‌బోర్డు నాగలి (తిరగలి నాగలి, రెక్కల నాగలి)ని వినియోగించడం మంచిది. ఏటవాలు భూముల్లో వాలుకు అడ్డంగా దుక్కులు దున్నాలి.

దుక్కులతో ప్రయోజనాలు

వేసవి దుక్కులతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని మంత్రాలయం వ్యవసాయాధికారి జీరా గణేష్ పేర్కొన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో అత్యధికంగా నల్లరేగడి, ఎర్ర నేలలు ఉన్నాయి. పత్తి పంట ఎక్కువగా సాగు చేయడంతో లోతు దుక్కులు కచ్చితంగా చేసుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో లోతు దుక్కులు పంటను రక్షించుకునేందుకు దోహదపడతాయన్నారు. వ్యవసాయాధికారి వివరించిన ప్రయోజనాలు ఇలా ఉన్నాయి.

- నేలపొరలు విచ్ఛిన్నం కావడంతో నేలలో గాలితో పాటు తేమ శాతం పెరిగి ఆరోగ్యకర సూక్ష్మజీవుల సంతతి మెరుగుపడుతుంది.
- రబీ సీజన్‌లో మిగిలిన కలుపు మొక్కలు, వేర్లు, చెత్తా చెదారం మట్టిలో కలవడం, సూర్యరశ్మి సోకడంతో నిద్రావస్థలో ఉన్న చీడ పురుగులు నశిస్తాయి.
- సేంద్రియ పదార్థాలు విడిపోయి త్వరగా పోషకాలుగా మారుతాయి.
- వాలుకు అడ్డంగా దున్నడంతో నేల కోతకు గురి కాకుండా నీరు ఇంకిపోవడానికి ఆస్కారం ఉంటుంది.
- పురుగు మందుల అవశేషాలు సూర్యరశ్మికి ఆవిరై నేలకు హాని తగ్గుతుంది.
- మొండి జాతికి చెందిన తుంగ, కలుపు మొక్కల బెడద దాదాపు తొలగిపోతుంది.
- నేలలో మట్టి రేణువులు 50 శాతం, నీరు 25 శాతం, గాలి 25 ఉంటుంది. ఇవి సమపాళ్లలో ఉండాలంటే లోదుక్కులు తప్పనిసరి.
- భూమి గుల్లబారడంతోపాటు పైర్ల వేరువ్యవస్థ వృద్ధి చెంది మొక్క ఆరోగ్యకరంగా పెరుగుతుంది.
- మొక్కకు పోషకాలు అందేందుకు ఎలాంటి అవాంతరాలు ఉండవు.

భూసార పరీక్షలు అవసరం



లోతు దుక్కులు చేసుకోవడంతోపాటు ఇదే సమయంలో రైతులు మట్టి పరీక్షలు చేయించుకోవడం మంచిది. భూసార పరీక్షలను బట్టి ఆమ్ల, క్షార ధాతువులు, సూక్ష్మ పోషకాల శాతాలు తెలుసుకోవచ్చు. పరీక్షలకు అనుగుణంగా రసాయన, సేంద్రియ ఎరువులు వాడుకోవచ్చు. తద్వారా పెట్టుబడులు దాదాపుగా తగ్గించుకోవచ్చు. ప్రస్తుత సమయంలో సేంద్రియ ఎరువులను నేలలో చల్లుకోవడం చేయాలి. నేలను దున్నడం వల్ల సేంద్రియ పదార్థాలు విచ్ఛిన్నమై త్వరగా నేల సారం పెరిగేందుకు దోహదపడుతుంది. ఘనజీవామృతం, డీకంపోజర్ నేలలో చల్లుకోవడంతో సూక్ష్మజీవుల సంతతి పెరుగుతుంది. మండలంలోని రైతులకు వేసవి దుక్కుల ప్రాధాన్యతను వివరిస్తున్నాం.

– మర్రి స్రవంతి, వ్యవసాయాధికారిణి, నందవరం

తప్పుల తడకగా సీనియారిటీ జాబితా

ఆదోని సెంట్రల్: ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారులు విడుదల చేసిన మున్సిపల్ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా తప్పుల తడకగా ఉందని ఏపీ పురపాలక ఉపాధ్యాయుల సామాఖ్య ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ఆర్.గోపాల్‌రెడ్డి, వి.సురేష్‌కుమార్ అన్నారు. వారు బుధవారం స్థానిక కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. ఆదోని, నంద్యాల పురపాలక సంఘం పరిధిలోని మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించి దాదాపు వంద మంది వివరాలు తప్పుగా ఉన్నాయన్నారు. అపాయింట్‌మెంట్ తేదీలు తప్పుగా ఉండడం, పాఠశాల సహాయకులుగా పదోన్నతులు పొందిన వారి పేర్లు ఇప్పటికీ జాబితాలో ఉండడం, కొందరు ఉపాధ్యాయుల పేర్లు అసలు లేకపోవడం, ఉపాధ్యాయుల కేటగిరీ, విద్యార్హతలు, పనిచేస్తున్న పాఠశాల పేరు తప్పుగా ఉండడం, మున్సిపల్ యాజమాన్యంలోకి వచ్చిన ఎయిడెడ్ ఉపాధ్యాయుల సీనియారిటీ ఇలా అనేక లోపాలు ఉన్నాయని ఆరోపించారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు మండల అధికారులకు తగిన సూచనలు ఇవ్వాలని, గతంలో మున్సిపల్ ఉపాధ్యాయులందరూ తమ సర్వీస్ రిజిస్టర్ తీసుకొని జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి రావడం జరిగిందని, ఇప్పుడు కూడా తమ అభ్యంతరాలను వ్యక్తం చేయడానికి మున్సిపల్ ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి రావాలంటూ అసౌకర్యానికి గురి చేస్తున్నారని వాపోయారు. తప్పుల తడకగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను సరిచేసి పక్కా వివరాలతో సక్రమమైన జాబితా రూపొందించాలని డిమాండ్ చేశారు.

విత్తన, ఎరువుల దుకాణాల తనిఖీ

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని విత్తన, ఎరువుల దుకాణాలను బుధవారం ఏడీఏ బాలవర్ధిరాజు, ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి తనిఖీ చేశారు. శ్రీదీప్తి ట్రేడర్స్‌లో రికార్డులు సరిగా లేనందున మొత్తం రూ.34,85,082 విలువైన పత్తి, మిరప, కంది విత్తనాల అమ్మకాలు నిలుపుదల చేశారు. అలాగే జయలక్ష్మి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్‌లో రూ.7,13,562 విలువ గల పత్తి విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు ఏడీఏ తెలిపారు. అలాగే భువనేశ్వరి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్, హైటెక్ ఆగ్రో ఏజెన్సీస్‌లో పత్తివిత్తనాల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అధిక ధరలకు పత్తి విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రైతులు తప్పనిసరిగా విత్తన, ఎరువులను కొనుగోలు చేసినప్పుడు రసీదు పొందాలని సూచించారు. బిల్లులో లాట్ నంబర్ కచ్చితంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మండలానికి 160 పత్తి విత్తన నమూనాలను టార్గెట్‌గా ఇవ్వగా ఇప్పటివరకు 80 నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు వెల్లడించారు. అలాగే 125 హెచ్‌టీ శాంపిల్స్ కోసం కిట్స్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో 25 రకాలైన పత్తి విత్తనాలను అక్కడికక్కడే హెచ్‌టీ టెస్ట్ చేసినట్లు చెప్పారు. వ్యవసాయ సిబ్బంది వెంట ఉన్నారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ బాలవర్ధిరాజు, ఏఓ అశోక్‌కుమార్ రెడ్డి

విత్తన కొరత లేకుండా చూడాలి

ఆదోని రూరల్: రైతులకు విత్తన కొరత లేకుండా చూడాలని, అడిగిన వారందరికీ సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు కోరారు. ఈ మేర కు బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద ఏడీఏ బాలవర్ధిరాజు, ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డిల కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సబ్సిడీ వేరుశనగ విత్తనాలు అదనంగా తెప్పించి రైతులకు పంపిణీ చేయాలని కోరా రు. పంట నష్ట పరిహారం తక్షణమే రైతుల ఖాతా ల్లోకి జమ చేయాలన్నారు. రైతు భరోసా కిసాన్ సమ్మాన్ రైతుల ఖాతాల్లోకి జమ చేయాలని, అధిక ధరకు పత్తి విత్తనాలను అమ్ముతున్న వారిపై చర్య లు తీసుకోవాలని కోరారు. ఏపీ రైతు సంఘం నాయకులు అయ్యప్ప, మునిస్వామి, తిక్కన్న, పాండవగల్లు సర్పంచ్ కె.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ రామమూర్తి

పెద్దకడబూరు: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఎంఈఓ రామమూర్తి, మాస్టర్ ట్రైనర్స్ శివకుమార్, రజియా సూచించారు. ఈ మేరకు బుధవారం పెద్దకడబూరు ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని వివిధ పాఠశాలలో పనిచేస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులకు, వంట సిబ్బందికి మధ్యాహ్న భోజన కార్యక్రమంపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మెనూ ప్రకారం సోమవారం నుంచి శనివారం వరకు మధ్యాహ్న భోజనం తయారు చేయు విధానాన్ని వివరించారు. విద్యార్థులకు రోజుకు ఒక రకమైన భోజనం వడ్డించాల్సి ఉంటుందన్నారు. పరిసరాల శుభ్రతతో పాటు తాజా ఆకుకూరలు, కూరగాయలు, నాణ్యమైన సరుకులు ఉపయోగించి రుచికరమైన భోజనం చేయాలని సూచించారు. ఎంఐఎస్ కో–ఆర్డినేటర్స్ లక్ష్మన్న, సీఆర్‌పీ లక్ష్మన్న, ఆచారి, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం చేయించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు

నందవరం: ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కి ఆధార్ అనుసంధానం చేయించాలని ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి అధికారులు, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించి కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఉపాధి కూలీలకు రోజు వారి వేతనం రూ.300 గిట్టుబాటు అయ్యే విధంగా పనులు చేయాలని సూచించారు. ఆధార్ అనుసంధానం, బ్యాంక్ ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ పూర్తయితేనే ఉపాధి కూలీల బ్యాంక్ ఖాతాలకు నగదు జమ అవుతుందని వివరించారు. గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించి, ప్రభుత్వం అందించే రాయితీలను వివరించాలన్నారు. హార్టికల్చర్ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించేలా కృషి చేయాలని సూచించారు. ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రథోత్సవానికి భారీ బందోబస్తు

ఆదోని అర్బన్: మహాయోగి లక్ష్మమ్మవ్వ వెండి రథోత్సవం సందర్భంగా గురువారం డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వన్ టౌన్‌సీఐ తేజమూర్తి మాట్లాడారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎక్కడెక్కడ సిబ్బంది విధులు నిర్వహించాలో సూచనలు చేశారు. డీఎస్పీ, ట్రైనీ డీఎస్పీ, ఆరుగురు సీఐలు, ఏడుగురు ఎస్‌ఐలు, 250 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు చెప్పారు. సీఐలు గోపీ, నిరంజన్‌రెడ్డి, నరసింహరాజు, మంజునాథ్ ఉన్నారు.

లక్ష్మమ్మవ్వ జాతరకు ముస్తాబు


లక్ష్మమ్మవ్వ నగర్‌లో విద్యుత్ దీపాల వెలుగులు

ఆదోని టౌన్: భక్తుల పాలిట ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్న మహాయోగి లక్ష్మమ్మవ్వ 92వ జాతర మహోత్సవానికి భక్తులు ఏర్పాటు చేశారు. పట్టణంలోని మహాయోగి లక్ష్మమ్మవ్వనగర్, అంబేడ్కర్‌నగర్‌లోని విగ్రహాలను, దేవాలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం నుంచే లక్ష్మమ్మవ్వకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ప్రత్యేక అలంకరణ చేపట్టారు. రోడ్డు పొడవునా కి.మీ.కు పైగానే విద్యుత్ దీపాలను అలంకరించారు. ఈనెల 30న గురువారం లక్ష్మమ్మవ్వ జాతర కనులపండువగా జరగనుంది. వేలాదిగా భక్తులు పాల్గొననున్నారు. అంబేడ్కర్‌నగర్, మహాయోగి లక్ష్మమ్మవ్వనగర్ ప్రాంతాల్లో గురువారం జాతర జరగనుంది. ఈ సందర్భంగా రథోత్సవం, పల్లకీ సేవ, భక్తులకు అన్నదానం, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

నేడు అన్నదానం

ఆదోని అర్బన్: ఆదోని భక్తుల ఇలవేల్పు మహాయోగి లక్ష్మమ్మవ్వ వెండి రథోత్సవం సందర్భంగా గురువారం సంతపేటలోని భారతి నిలయం పాఠశాల ప్రాంగణంలో భక్తుల సాయంతో అన్నదానం నిర్వహించనున్నట్లు దాత మహర్షి విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్నదానం చేపడుతున్నట్లు వెల్లడించారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే జైలుకే..


రికార్డులు సక్రమంగా లేని బైకులను సీజ్ చేస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి


ఆదోని అర్బన్: ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శివనారాయణస్వామి హెచ్చరించారు. ఈ మేరకు ఆదోని పట్టణంలోని వాల్మీకి నగర్, బోయగేరి ప్రాంతాల్లో బుధవారం ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, ట్రైనీ డీఎస్పీ శ్రీధర్ ధీరజ్‌ల ఆధ్వర్యంలో సీఐలు, ఎస్‌ఐలు, పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత ఇళ్లల్లో సోదాలు చేశారు. ఇందులో 30 లీటర్ల నాటుసారా, రికార్డులు సరిగా లేని 43 వాహనాలను సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నాటుసారా తయారీ, అమ్మడం, కర్ణాటక మద్యం సరఫరా, అమ్మడం లాంటివి చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఆదోని వన్‌టౌన్, టూ టౌన్, త్రీటౌన్, రూరల్ సీఐలు తేజమూర్తి, గోపీ, నరసింహరాజు, నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో రాణించాలి


అండర్-15లో విజేతలైన క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

ఆదోని టౌన్: క్రికెట్ టోర్నమెంట్ అండర్–15, 19లో ప్రతిభ చాటిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆదోని క్రికెట్ అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడు విట్టా రమేష్ పేర్కొన్నారు. క్రీడాకారులకు తనవంతుగా సహాయ సహకారాలు, ప్రోత్సాహం అందిస్తానని చెప్పారు. బుధవారం భీమాస్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విట్టా రమేష్ మాట్లాడారు. ఆదోని పట్టణానికి చెందిన క్రీడాకారిణులు బి.సంజన అండర్–15, అండర్–19లో ఇంటర్ జిల్లా స్థాయిలో రాణించిందన్నారు. జి.మేఘన అండర్–15లో జిల్లాస్థాయిలో ప్రతిభను చాటిందన్నారు. జూన్ 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు అండర్–15 క్రీడా పోటీలు నెల్లూరులో జరగనున్నాయని, జూన్ 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అండర్–19 ఇంటర్ జిల్లా పోటీలు వెంకటగిరిలో జరుగుతాయన్నారు. ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ క్రీడాకారులకు మంచి ప్రోత్సాహం అందిస్తుందని, ఈ యేడాది సమ్మర్ క్యాంపులు నిర్వహించినట్లు చెప్పారు. అసోసియేషన్ కార్యదర్శి వెంకటేష్, కోచ్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ సంబరాలు నిషేధం


రాజకీయ పార్టీల నాయకులకు సూచనలు చేస్తున్న సీఐ రామకృష్ణయ్య

గోనెగండ్ల: ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం విజయోత్సవ సంబరాలు, ర్యాలీలు వంటివి చేపట్టరాదని సీఐ రామకృష్ణయ్య సూచించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జూన్ 4వ తేదీ వెలువడే సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై రాజకీయ నాయకులు సంయమనం పాటించాలన్నారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో టపాసులు కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు, గుంపు గుంపులుగా జనం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏ పార్టీ గెలిచినా ఇతర పార్టీల వారిని కించపరచరాదని పేర్కొన్నారు. అలాగే వివిధ సంస్థల సర్వే ఫలితాలు, ఎగ్జిట్ పోల్స్‌పై సంబరాలు చేసుకోరాదని, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు చేయరాదని సూచించారు. జూన్ 15వ తేదీ వరకు బాణసంచా కాల్చడం, విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, ఘర్షణలకు దిగితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు పాటించాలని కోరారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు

కోసిగి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.వీరేష్, మండల కార్యదర్శి అంజి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తుగా అడ్మిషన్లు చేస్తున్న విద్యా శాఖ అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అలాగే కోసిగి మౌంట్ కార్మెల్ పాఠశాలలో అడ్మిషన్ ఫీజుతో పాటు, యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాల కోసం ప్రభుత్వ ధరల కంటే అధిక ఫీజు వసూలు చేస్తున్నారన్నారు. ఆ పాఠశాలపై విద్యాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆ సంఘం నాయకులు పురుషోత్తం, యేసు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించిన కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని గాంధీనగర్‌లో గల న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు చిన్నారుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి వేలాది రూపాయల ఫీజు వసూలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు అతిక్రమించిన యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు రామకృష్ణనాయుడు, వంశీ, విష్ణు, సిద్దు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక వృత్తుల వారికి చేయూతనివ్వాలి


మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ

ఎమ్మిగనూరుటౌన్: సామాజిక వృత్తుల వారికి ప్రభుత్వాలు చేయూతనందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని శివ సర్కిల్ వద్దనున్న కేవీపీఎస్ కార్యాలయంలో బుధవారం ఆ సమితి జిల్లా అధ్యక్షుడు దేవసహాయం అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సామాజిక వృత్తులైన డప్పు, చర్మ, కాటికాపరి, సఫాయి, తంబూర లాంటి వృత్తుల వారు నేటికీ ఆయా పనులు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. ఆయా వృత్తుల వారిని పాలకులు గుర్తించి ఆదుకోవాలని కోరారు. ఆయా రంగాల వారు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 19న చర్మకార వృత్తిదారుల సమావేశాన్ని ఎమ్మిగనూరులో నిర్వహిస్తున్నామని, ఆ వృత్తిదారులందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఆయా సంఘాల నాయకులు కరుణాకర్, కృష్ణ, గురుస్వామి, తిక్కప్ప, చిన్న మారయ్య, భాస్కర్, రాజు, పెద్ద బాబు తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక రైతు మృతి


హరీష్‌చంద్ర (ఫైల్)

దేవనకొండ: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండలంలోని జిల్లెడబుడకల గ్రామానికి చెందిన రైతు కొండమీది హరీష్‌చంద్ర కోలుకోలేక మృతి చెందాడు. హరీష్‌చంద్ర తనకున్న 5 ఎకరాలతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయం నిమిత్తం దాదాపు రూ.12 లక్షలు దాకా అప్పు చేశాడు. ఆ అప్పు ఎలా తీర్చాలో తెలియక ఆదివారం పొలంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా.. కుటుంబ సభ్యులు వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం ఉదయం మరణించాడు. మృతుడికి భార్య సుజాత, కుమార్తె, కుమారుడు ఉన్నారు.